సాక్షి
కుమురం భీం
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024

గరిష్ఠం/కనిష్ఠం
33.8/22.6

వాతావరణం
ఆకాశం చాలా వరకు నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు రాత్రిపూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి 'గృహజ్యోతి' అమలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: అర్హులైన విద్యుత్ వినియోగదారులకు మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం అమలు చేస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌లో భాగంగా జీరో బిల్లు అందిస్తామని పేర్కొన్నారు. పథకానికి అర్హులై ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోకపోయినా, వివరాలు సరైనవి లేకపోయినా, లబ్ధి పొందలేకపోతున్నా ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ నంబర్, తెల్ల రేషన్‌కార్డుతో అనుసంధానమైన ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్‌ఫేర్


ప్రదర్శనలను పరిశీలిస్తున్న సైన్స్ అధికారి

కాగజ్‌నగర్‌రూరల్‌: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నామని జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్(పెట్రోల్ పంపు)లో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు మామిడాల తిరుపతయ్య, రోజారమణి, కేశవ్, అవినాష్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ సీవీ రామన్ తన ప్రయోగాలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారని అన్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ శారద సూచించారు. అధ్యాపకులు రాజేశ్వర్, జనార్దన్, దత్తాత్రేయ, దేవేందర్, వెంకటేశం, రోజ్‌మేరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పల్స్ పోలియో నిర్వహణపై బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి, సంక్షేమశాఖ, గిరిజనాభివృద్ధి, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 57,362 మంది ఉన్నారని తెలిపారు. పోలియో వ్యాక్సినేషన్ కోసం 672 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 78 మంది సూపర్‌వైజర్లను నియమించడంతో పాటు 22 మొబైల్ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లలోనూ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 4, 5 తేదీల్లో ప్రతీ ఇంటిని సందర్శించి పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు వ్యాక్సినేషన్ అందిస్తామని తెలిపారు. డీఆర్‌డీవో సురేందర్, డీటీడీవో రమాదేవి, సంక్షేమశాఖ అధికారి భాస్కర్, విద్యాశాఖ పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు, డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ అధికారి సిద్దార్థ పాల్గొన్నారు.

క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి


సెంటర్ ప్రారంభిస్తున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లాకు నూతనంగా మంజూరైన ఖేల్ ఇండియా సెంటర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో ప్రారంభించారు. డీటీడీవో మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు ఖేల్ ఇండియా సెంటర్ మంజూరైనట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులకు షూటింగ్ బాల్‌లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్దవ్, హెచ్‌ఎం కృష్ణారావు, పీడీ మధుసూదన్, కోచ్‌లు రాకేశ్, విద్యాసాగర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బదిలీ

- జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా హేమంత్ బోర్కడేకు పోస్టింగ్
- మళ్లీ దక్కని కలెక్టర్ పోస్టు
- కుమురంభీం నూతన కలెక్టర్‌గా స్నేహ శబరీష్


బదిలీపై వెళ్తున్న హేమంత్ బోర్కడే

సాక్షి, ఆసిఫాబాద్‌: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే బదిలీ అయ్యారు. కలెక్టర్ బదిలీ కానున్నారనే సమాచారం నెల రోజులుగా వినిపిస్తూ వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల నేపథ్యంలో కలెక్టర్ బదిలీ జరిగింది. ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్‌గా జిల్లాలోనే ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలెట్టిన హేమంత్ బోర్కడే ఇదే జిల్లాకు మళ్లీ పదోన్నతిపై 2023 ఫిబ్రవరి 11న కలెక్టర్‌గా వచ్చారు. ఏడాది 17 రోజులకే ఆయన బదిలీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) అదనపు కమిషనర్‌గా ఆయనను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దక్కని జిల్లా పోస్టింగ్..

సాధారణంగా ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు బదిలీలు జరుగుతుంటాయి. ఒకే జిల్లాలో మూడేళ్లు పనిచేసిన లేదా సొంత జిల్లాకు చెందిన వారిని ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ చేయడం సహజమే. అయితే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుమురంభీం జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే బదిలీ విషయంలో మాత్రం పార్లమెంట్ పరిధిని పరిగణనలోకి తీసుకుని బదిలీ చేశారు. అంతకు ముందే ఆయన బదిలీ అవుతారన్న ప్రచారం కావడం గమనార్హం. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మొదటి ఆరునెలలు నిక్కచ్చిగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారు. సిబ్బంది సైతం అవినీతి ఆరోపణలకు తావివ్వకుండా పనిచేశారు. కానీ, ఆ తర్వాత కాలంలో ఉద్యోగులపై పట్టుకోల్పోవడం.. వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సైతం చూసీచూడనట్లుగా వ్యవహరించడం.. కొందరి ఉద్యోగుల మాటలనే పరిగణనలోకి తీసుకోవడం.. తదితర కారణాలతో జిల్లా పరిపాలన గాడి తప్పిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. బీసీ బంధు పథకంలో లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు.. కలెక్టరేట్‌లో సీసీ కెమెరాల ఏర్పాటులో జరిగిన నిధుల దుర్వినియోగం.. అర్హత లేకపోయినా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అనధికారిక సీసీలుగా పనిచేయించడం తదితర అంశాలు ఆయనకు మచ్చతెచ్చాయి. ఇక ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కలెక్టరేట్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించినా కలెక్టర్ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోగా.. వారిని వెనకేసుకురావడంపై పెద్దఎత్తున ఆరోపణలు వినిపించాయి. ఎన్నికల సిబ్బంది, ఇతర ఏర్పాట్ల కోసం ఖర్చు పేరిట రూ.లక్షల్లో ఎన్నికల నిధుల దుర్వినియోగం చేసిన అంశాలపై 'సాక్షి' కథనాలు ప్రచురించింది. సాక్షి పత్రికలో వచ్చిన కథనాలపై రాష్ట్ర నిఘా విభాగం అధికారులు ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టి సమగ్ర నివేదికను సైతం ప్రభుత్వానికి అందజేసినట్లు సమాచారం. జిల్లా ఎన్నికల అధికారి(ఆర్‌వో) హోదాలో ఉన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే ఉదాసీనతగా వ్యవహరించడమే వీటన్నింటికీ కారణాలుగా నిఘా విభాగ అధికారులు తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ ప్రచారం ఊపందుకోగా.. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలతో గత మూడేళ్లకుపైగా పార్లమెంటు పరిధిలో పనిచేయడంతో ఆయనకు బదిలీ తప్పనిసరైందని అధికారికవర్గాలు చెబుతున్నాయి. కాగా జిల్లా కలెక్టర్‌ను మరో జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ చేయకుండా జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వడం వెనుక ఎన్నికల నిధుల దుర్వినియోగ అంశాలు తెలిసీ చర్యలు తీసుకోకపోవడం.. నిఘా విభాగ అధికారులు సర్కారుకు అందజేసిన నివేదికలో పేర్కొన్న ఆర్థిక ఆరోపణల నేపథ్యమే కారణమని ఉద్యోగ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.


నూతన కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న స్నేహ శబరీష్ కలెక్టర్‌గా కుమురం భీం జిల్లాకు బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ అసలు పేరు మొగిలి స్నేహలత. వివాహం తర్వాత 2023 మార్చి 27న కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఆమె తన పేరు మార్చుకున్నారు. హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన స్నేహలత బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. స్నేహ తండ్రి రాజేంద్రకుమార్ హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అమ్మ మాధవి గృహిణి, అక్క నిఖిత, చెల్లి అలేఖ్యలు ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నారు. తమ్ముడు సాయి తేజ గ్రూప్స్‌కు సన్నద్ధం అవుతున్నాడు. 2017లో స్నేహ శబరీష్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ములుగు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి శబరీష్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ఖమ్మం అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆమె కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించారు. సర్కారు ఆస్పత్రిలో పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చి అప్పట్లో అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఇంటర్ పరీక్షలు షురూ

- తొలిరోజు 306 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలో బుధవారం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 కేంద్రాల్లో మొదటి రోజు 5,625 మంది విద్యార్థులకు 5,319 మంది హాజరయ్యారని డీఐఈవో శంకర్ వెల్లడించారు. జనరల్ విభాగంలో 4,745 మందికి 4521 మంది హాజరు కాగా.. 224 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 880 మందికి 798 మంది హాజరు కాగా, 82 గైర్హాజరయ్యారు. తొలిరోజు మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో తెలిపారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లోని కేంద్రాలను ఉన్నతాధికారులు తనిఖీచేశారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే తనిఖీ చేశారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రాన్ని కూడా పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ సురేశ్‌కుమార్ తనిఖీ చేశారు. రెబ్బెనలోని పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో శంకర్ పరిశీలించి, పరీక్ష తీరును పర్యవేక్షించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.


కెరమెరి: ఆటోలో వచ్చిన కేజీబీవీ విద్యార్థినులు


కౌటాల: పరుగులు తీస్తున్న విద్యార్థులు

ఆలస్యం.. అనుమతి నిరాకరణ

కౌటాల: చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన సోన్లే రాజ్‌కుమార్ కౌటాల జూనియర్ కళాశాలలో ఇంటర్(సీఈసీ) ఫస్టియర్ చదువుతున్నాడు. బుధవారం పరీక్ష కేంద్రానికి 15 నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు కేంద్రంలోని అనుమతి నిరాకరించారు. పరీక్షకు అనుమతించాలని విద్యార్థి బతిమిలాడినా అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయాడు.

మిల్లర్లలో గుబులు!

- జిల్లాలోని రైస్‌మిల్లులపై దాడులు
- లక్షల్లో బస్తాలు మిస్సింగ్
- అవకతవకలపై ప్రత్యేక దృష్టి
- నేటితో ముగియనున్న సీఎంఆర్ గడువు

కౌటాల(సిర్పూర్‌): ప్రభుత్వం నుంచి వరిధాన్యం మిల్లింగ్ కోసం తీసుకొని బియ్యం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ధాన్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. సిర్పూర్(టి) మండలంలోని రెండు మిల్లుల్లో ధాన్యం పక్కదారి పట్టడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే.

భారీగా అవకతవకలు

జిల్లాలోని రైస్ మిల్లుల యాజమాన్యాలు సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి అప్పగించకుండా పక్కదారి పట్టిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు అవకతవకలు జరిగిన రైస్ మిల్లులపై చర్యలకు ఉపక్రమించారు. ఆయా మిల్లుల్లో సీఎంఆర్ బియ్యం లెక్కలు ఏ రిజిస్టర్, ఇతర బియ్యం వివరాలను బీ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. మిల్లర్లు రాయితీ బియ్యం(బయట సేకరించినవి) లెక్కలను సీఎంఆర్‌లో కలుపుతూ ప్రభుత్వానికి అంటగడుతున్నారని సమాచారం. ప్రస్తుతం సీఎంఆర్ గడువు ఒక్కరోజే మిగిలి ఉండటంతో రైస్ మిల్లుల్లో బియ్యం బస్తాలు మాయం అవుతుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గడువులోగా గగనమే..!

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు 68 కిలోల చొప్పున సీఎంఆర్ ఇవ్వాలి. ఇందుకు గాను ప్రభుత్వం మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తుంది. జిల్లావ్యాప్తంగా యాసంగి 2022– 23కు సంబంధించి 1.62,110 క్వింటాళ్ల బియ్యాన్ని జిల్లాలోని 20 రైస్ మిల్లులు ఎఫ్‌సీఐకి అప్పగించాలి. సీఎంఆర్ ఇచ్చే గడువు గత నెలలోనే ముగిసినప్పటికీ ప్రభుత్వం ఈ నెల 29 వరకు పొడిగించింది. ఇప్పటివరకు రైస్ మిల్లర నుంచి కేవలం 8,120 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అందాయి. మరో 1.53,990 క్వింటాళ్ల బియ్యం రెండు రోజుల్లో రావడం అనుమానంగా మారింది. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ఎప్పటికప్పుడు మిల్లులను పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొద్దిరోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తుండడంతో మిల్లులకు తాళం వేసి యజమానులు వెళ్లిపోతున్నారు. తనిఖీలకు వచ్చిన అధికారులకు తిప్పలు తప్పడం లేదు. బియ్యం పక్కదారి పట్టించిన రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందిచనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.


దహెగాంలోని రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

లక్షల బస్తాలు మాయం..!

జిల్లాలోని సిర్పూర్(టి), దహెగాం మండలాల్లో రైస్ మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. కౌటాల, కాగజ్‌నగర్, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో రైస్ మిల్లులను మూసి ఉంచుతున్నారు. అధికారుల వరుస దాడుల్లో దాదాపు 1,05,394 వేల ధాన్యం బస్తాలు కనపడకుండా పోయిన విషయం చర్చనీయాంశంగా మారింది. వీటి విలువ రూ.8.90 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. కేవలం రెండు మిల్లులోనే ఈ స్థాయిలో ధాన్యం గోల్‌మాల్ జరిగితే మొత్తం 20 రైస్ మిల్లుల్లో పరిస్థితి ఎలా ఉందో తనిఖీలు చేస్తేనే బయటపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో 2022 సెప్టెంబర్‌లో 8,399 క్వింటాళ్ల బియ్యం మాయమైనట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. రూ.3 కోట్ల విలువైన ఈ నిల్వలు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు రాకుండానే వచ్చినట్లుగా అధికారులు రికార్డులు తయారు చేసి, బియ్యం బొక్కేశారని అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఏడాదిన్నర గడిచినా పాత్రదారులు ఎవరు అనే అంశం వెలుగులోకి రాలేదు. రైస్ మిల్లర్లు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి వ్యాపారులకు అమ్ముకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. 2022– 23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 24,197 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేస్తే 16,212 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ లక్ష్యం ఉంది. ఇందులో మిల్లర్లు ఇంకా 15,023 మెట్రిక్ టన్నుల బియ్యం అందించలేదు. అలాగే 2023– 24 యాసంగి సీజన్‌కు సంబంధించి 4113 లక్ష్యం మెట్రిక్ టన్నులు ఉండగా.. ఇప్పటివరకు ఒక్క టన్ను కూడా అందించలేదని తెలుస్తోంది.

బ్లాక్ లిస్టులో పెడతాం

సీఎంఆర్ బియాన్ని ఇవ్వడానికి గురువారం ఒక్కరోజే గడువు ఉంది. ప్రభుత్వం గడువు తేదీ పెంచలేదు. బియ్యం సకాలంలో ఇవ్వని వారిపై క్రిమినల్ కేసులు పెట్టి ఆర్‌ఆర్ చట్టపరిధిలో రికవరీ చేస్తాం. బియ్యం ఇవ్వని మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి తర్వాతి సీజన్‌లో ధాన్యం కేటాయింపులు నిలిపివేస్తాం.

– తారామణి, డీఎస్‌వో

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు..!



- ఈ ఏడాది 366 రోజులు
- నేడు లీప్ ఇయర్ డే
- నాలుగేళ్లకోసారి అదనపు రోజు

సాక్షి, మంచిర్యాల డెస్క్‌: ఈ రోజు అదనం.. ప్రతీ సంవత్సరం సాధారణంగా ఫిబ్రవరిలో 28 రోజులు ఉంటాయి. కానీ ఈ ఏడాది 29 రోజులు ఉన్నాయి. 366 రోజులు ఉంటాయి.. ఎందుకంటే ఇది లీపు సంవత్సరం. భూ పరిభ్రమణానికి 365 రోజుల మీద పావు రోజు పడుతుంది. ఇలా నాలుగేళ్లకోసారి ఆ పావు రోజులు కలిపి ఒక రోజు అదనంగా చేరుతుంది. అలా ఫిబ్రవరిలో 29 రోజులు వచ్చిన సంవత్సరాన్ని లీపు సంవత్సరం అంటారు. ఈ రోజు జన్మించినా.. పెళ్లి రోజయినా ఓ ప్రత్యేకత ఏర్పడుతుంది. నేడు లీపు ఇయర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఫిబ్రవరి 29న జన్మించిన వారిని లీప్లింగ్, లీప్ ఇయర్ బేబీగా పిలుస్తారు. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జన్మదినం జరుపుకుంటారు. యూకే, హాంగ్‌కాంగ్‌లో మార్చి ఒకటిన, న్యూజిలాండ్ వాసులు ఒక రోజు ముందే 28న నిర్వహిస్తారు.

చరిత్రలో ఈ రోజు..

దివంగత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 1896 ఫిబ్రవరి 29న జన్మించారు. మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలోనూ పాలుపంచుకున్నారు. అనేక సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. కేంద్ర హోంమంత్రి, ఆర్థిక మంత్రి పదవులతోపాటు భారతదేశ రెండో ఉప ప్రధానిగా, 1977–79 మధ్యకాలంలో భారత దేశ నాలుగో ప్రధానిగా పని చేశారు.

ఎప్పటికీ గుర్తుండేలా..

లక్ష్యం.. కల.. భవిష్యత్ ప్రణాళిక ఇలా ఏదైనా సరే ఎంచుకోండి. ఈ ప్రత్యేకమైన రోజున మళ్లీ నాలుగేళ్లకు గుర్తు చేస్తూ మన గమ్యం ఎక్కడి వరకు చేరామో తెలుసుకునేలా ఓ లేఖ రాసుకోండి. మీ ఫోన్ నుంచి మీకు మీరే మెయిల్ చేసుకుంటూ మళ్లీ నాలుగేళ్లకు గుర్తు చేసేలా షెడ్యూల్ సెట్ చేసుకోండి. మీ ఫోన్‌లో క్యాలెండర్ ఓపెన్ చేసి టాస్క్ ద్వారా సేవ్ చేసుకుంటే భవిష్యత్‌లో గుర్తు చేస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఇలా చేస్తే నాలుగేళ్లలో ఎంత మార్పు వచ్చింది అనేది ఇట్టే తెలిసిపోతుంది.

పెళ్లయి 32 ఏళ్లు.. ఎనిమిదో పెళ్లిరోజు


పిల్లలతో వెంకటేశ్వర్లు దంపతులు

మందమర్రిరూరల్‌: మాకు 1992 ఫిబ్రవరి 29న వివాహం జరిగింది. ఇప్పటికి పెళ్లయి 32 సంవత్సరాలు అవుతున్నా మా పెండ్లి రోజు నాలుగేళ్లకోసారి రావడంతో 2024 ఫిబ్రవరి 29న 8వ పెళ్లి రోజు జరుపుకుంటున్నాం. ఇలా నాలుగేళ్లకోసారి పెళ్లి రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ఆ రోజు మా కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి ఒక వేడుకలా జరపుకుంటాం. ఈ రోజు మళ్లీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాం. కుటుంబ సభ్యులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం. మాకు ఇద్దరు పిల్లలు.. పాప డాక్టర్ మైత్రి రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో అనెస్థిషియన్ స్పెషలిస్టుగా, బాబు భార్గవ్ హైదరాబాద్‌లో ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు.– రాంభాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు

మరిచిపోలేని రోజు



జన్నారం: మాది జన్నారం గ్రామం. నాలుగేళ్లకోసారి వచ్చే ప్రతీ లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి 29న పెళ్లి జరగనుండడం ఎగ్జయిట్‌మెంటుగా ఉంది. లీపు ఇయర్‌లో ఈ రోజు పెళ్లిళ్లు చేసుకోవడం చాలా అరుదు. మాకు మహూర్తం ప్రకారం అదే రోజు రావడం సంతోషం అనిపిస్తుంది. ముందుగా కొంత ఇబ్బంది అనిపించినా వెరైటీగా ఉంటుందనే ఉద్దేశంతో అదే తేదీ ఖరారు చేసుకున్నాం. మరిచిపోలేని రోజు ఇది. నాలుగేళ్లకోసారి మా పెండ్లి రోజు ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఉంది. – కార్తీక్, భూమిక, జన్నారం

వెరైటీగా ఉండాలని



తాంసి: ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకుని వెరైటీగా ఉండాలని ముందుగానే నిర్ణయించుకున్నాం. గురువారం రామలింగేశ్వర ఆలయంలో పెళ్లి జరగనుంది. పెళ్లి ముహూర్తాలు పెద్దలు చూసినప్పటికీ ఫిబ్రవరి 29న వివాహం జరుపుకోవాలని పెద్దలను సైతం ఒప్పించాం. వారి అంగీకారంతో నేడు వివాహం చేసుకోబోతున్నాం.

– అశోక్, నాయని, తాంసి

ఈ రోజు పెళ్లి ఓ ప్రత్యేకత



నెన్నెల: లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి 29న మా పెళ్లి జరగనుండడం ఓ ప్రత్యేకతగా భావిస్తున్నాం. నాలుగేళ్లకోసారి వస్తుండడంతో ఈ రోజే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఈ మేరకు ముహూర్తం కూడా కుదరడం మా అదృష్టం. అందరిలా కాకుండా భిన్నంగా మా పెళ్లి రోజును నాలుగేళ్లకోసారి ఆనందంగా నిర్వహించుకునే అవకాశం దక్కింది. ఎదురుచూసి చేసుకునే ఏ సెలబ్రేషన్‌నైనా రెట్టింపు ఉత్సాహాన్ని ఇస్తుంది. అలాంటిది నాలుగేళ్లకోసారి మ్యారేజ్‌డే నాలుగింతల ఆనందాన్ని కలిగిస్తుంది. మా వివాహ రోజును ఒక పెళ్లి తంతుల ప్రతీ లీప్ ఇయర్‌లో ఘనంగా జరుపుకుంటాం. – పోగుల రాజేష్, సంధ్య, నెన్నెల

గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటా



మంచిర్యాలక్రైం: జన్మదిన వేడుక నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి వస్తుంది కాబట్టి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటా. అందరూ ప్రతీ ఏడాదికోసారి జరుపుకొంటే నేను నాలుగేళ్లకోసారి జరుపుకుంటా. మా బంధువులు, స్నేహితులు నువ్వు అదృష్టవంతుడివని అంటుంటారు. నాలుగేళ్లకోసారి బర్త్‌డే జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– బత్తుల వెంకటేష్, మంచిర్యాల

గర్వంగా ఉంది..



మంచిర్యాలక్రైం: నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి జన్మదిన వేడుకలు జరుపుకోవడం గర్వంగా ఉంది. నా స్నేహితుల జన్మదిన వేడుకలకు వెళ్లినప్పుడు అందరూ నన్ను ఆట పట్టిస్తారు. సుజాత బర్త్‌డే సమ్‌థింగ్ స్పెషల్ అంటుంటారు. నా బర్త్‌డేను బంధువులు, స్నేహితులకు చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాను.

– చిందం సుజాత, మంచిర్యాల, విద్యార్థిని

ఆశ్చర్యానికి గురవుతున్నాం..


బండి దిలీప్, మనీష, నస్పూర్

నస్పూర్‌: ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న మూడు ముళ్ల బంధంతో ఒక్కటి అవుతున్నందుకు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నామని బండి దిలీప్, మనీష తెలిపారు. నస్పూర్‌కు చెందిన దిలీప్‌కు పెద్దపల్లి జిల్లా ఓదెలకు చెందిన కట్కూరి మనీషకు గురువారం ఓదెలలో వివాహం జరగనుంది. తమ పెళ్లి ముహూర్తం కుదిరిన సమయంలో ఇది లీప్ సంవత్సరం అని తెలియదని దిలీప్ పేర్కొన్నాడు. తర్వాత తమ మిత్రులు ఇది లీప్ సంవత్సరమని, పెళ్లి రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని చెప్పడంతో ఒకింత ఆశ్చర్యం, ఆనందానికి గురయ్యామని అన్నాడు. మా పెళ్లి ముహూర్తానికి సమయం ఎప్పుడు దగ్గర పడుతుందా అని ఆత్రుతతో ఎదురు చూస్తున్నామని పేర్కొన్నాడు.

పన్నెండేళ్లలో మూడో పెళ్లిరోజు



కౌటాల(సిర్పూర్‌): కౌటాల మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీ చెందిన దుర్గం గులాబ్– సారిక దంపతులకు పెళ్లి జరిగి నేటితో పన్నెండేళ్లు పూర్తవుతాయి. కానీ వారికి ఇది మూడో పెళ్లిరోజు మాత్రమే. 2012 ఫిబ్రవరి 29న వీరి వివాహమైంది. అందరిలా ప్రతీ ఏడాది కాకుండా నాలుగేళ్లకోసారి భిన్నంగా పెళ్లిరోజు జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

నేడు వివాహ బంధంలోకి..



కౌటాల(సిర్పూర్‌): కౌటాలలోని సదాశివపేటకు చెందిన చదువుల సాయి, కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి చైతన్య ఫిబ్రవరి 29న వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఉదయం 11.25 గంటలకు భట్టుపల్లిలో పెళ్లి జరగనుంది. ఇద్దరికి ఇష్టమైన లిప్ సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి ఆనందంగా ఉందని వధూవరులు సాయి, చైతన్య తెలిపారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడికి గాయాలు

వేమనపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు చిన్నారులు కొట్టుకోవడంతో ఒకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ముల్కలపేట పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. డోలె ప్రదీక్ అనే బాలున్ని మరో బాలుడు కొరకడంతో మెడ, వీపుపై గాయాలయ్యాయి. అంగన్‌వాడీ సిబ్బంది గాయాలపై పసుపు రాసి ఇంటికి పంపించారు. పైగా విషయం తల్లిదండ్రులకు చెప్పవద్దని బెదిరించారు. ప్రదీప్‌కు స్నానం పోస్తుండగా అతని తల్లి గాయాన్ని గమనించి ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజితకు ఫిర్యాదు చేసినట్లు బాలుని తండ్రి రాజబాబు తెలిపారు.

పరీక్షకు హాజరైన విద్యార్థికి స్వల్ప అస్వస్థత

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రంలో బుధవారం పరీక్షకు హాజరైన ఓ విద్యార్థి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంఎల్‌టీ చేసిన ఆకర్ష్ ఠాకూర్ అనే విద్యార్థి పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన కొద్దిసేపటికే తల తిరుగుతోందని, చాతిలో నొప్పి వస్తుందని కింద పడిపోయాడు. బందోబస్తు ఎస్సై విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోలీసు వాహనంలో బజారు ఏరియాలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యుడు కొద్దిసేపటి తర్వాత ఇంటికి పంపించారు. పరీక్ష ఎలా రాస్తానోననే ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మీసేవ కేంద్రంపై కేసు



విచారణ నిర్వహిస్తున్న ఆర్‌ఐ ఖాలిక్

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని రాజా జిరాక్సులో నిర్వహిస్తున్న మీసేవ కేంద్రంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. కుల ధృవీకరణ పత్రాల కోసం అధిక రుసుం వసూలు చేస్తున్నారని ఆధారాలతో బాధితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. ఆర్ఐ ఎండీ ఖాలిక్ విచారణలో వాస్తవాలు వెలుగుచూడటంతో మీసేవకు సంబంధించిన స్టేషనరీ, స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాలాజీనగర్‌లో మీసేవ కేంద్రం ఉండాల్సివుండగా ఓ జిరాక్సు సెంటర్‌లో నడిపిస్తున్నాడని పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

కాలిబూడిదైన ఎలక్ట్రిక్ బైక్



కాలిబూడిదైన ఎలక్ట్రిక్ బైక్

ఆదిలాబాద్‌టౌన్: ఓ వ్యక్తి కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ బైక్ 24 గంటల వ్యవధిలోనే కాలిబూడిదైన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బేల మండలానికి చెందిన ఓ వ్యక్తి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఎబిలిటి ఈవీ, డిలైట్ కంపెనీ నుంచి ఈనెల 26న ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. 27న ఉదయం వాహనానికి పూజ చేశాడు. రాత్రి నడుపుతుండగా అందులో నుంచి పొగలు రావడంతో బైక్ దిగి పక్కన పెట్టగా మొత్తం కాలిపోయింది. బాధితుడు కంపెనీ యజమానులకు సమాచారం అందించాడు. మరో వాహనం ఇచ్చేందుకు వారు ముందుకొచ్చినట్లు తెలిసింది.

యువతకు 'స్కిల్స్'



సోలార్ టెక్నాలజీపై శిక్షణ పొందుతున్న యువకులు

- సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్
- మందమర్రిలో ఏర్పాటు
- నిరుద్యోగులకు సోలార్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మందమర్రిరూరల్(చెన్నూర్): విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి ఆధ్వర్యంలో సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు మందమర్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో రెండు కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముందుగా ఎనిమిది కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని యాజమాన్యం ప్రతిపాదించి నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఫిబ్రవరి 19న సోలార్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో 15 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ (హైదరాబాద్) శిక్షకుల ద్వారా శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, సింగరేణి సంస్థ సీఅండ్ఎండీ బలరాం, డైరెక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలున్న కోర్సులపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి



సింగరేణి పరిసర ప్రాంత భూనిర్వాసిత, ఉద్యోగుల వారసులకు, నిరుద్యోగ యువతకు సోలార్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో సింగరేణి ఆధ్వర్యంలో 15 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణకాలంలో రిఫ్రెష్‌మెంట్, మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నాం. శిక్షణ అనంతరం ప్రభుత్వామోదిత సంస్థ (ఆర్డీఎస్డీఈ) ద్వారా సర్టిఫికెట్ అందిస్తాం.
– గుండేటి శంకర్, ట్రైనింగ్ సెంటర్ మేనేజర్, మందమర్రి ఏరియా

మందమర్రిలో మొదటిసారిగా...



సింగరేణి పరిసర ప్రాంతాల్లో చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనతో మొదటిసారిగా మందమర్రిలో శిక్షణ తరగతులు ప్రారంభించాం. 15 రోజుల పాటు సోలార్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. తప్పకుండా ఉపాధి పొందుతారని ఆశిస్తున్నా. – ఏ.మనోహర్, ఏరియా జీఎం

ఉపాధి పొందుతా..



నేను బీకామ్ (కంప్యూటర్స్), బీఈడీ చేశా. డ్రోన్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ పొందేందుకు శ్రీరాంపూర్ నుంచి మందమర్రికి వస్తున్నా. ఈ కోర్సు నేర్చుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఎంతోమందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. పది మంది చేసే పనిని ఒక్క డ్రోన్ కెమెరా ద్వారా చేయవచ్చు. శిక్షణ అనంతరం ఉపాధి పొందుతాననే నమ్మకం ఉంది. శిక్షణ ఇస్తున్న సింగరేణి యాజమాన్యానికి ధన్యవాదాలు. – కీర్తి ప్రియాంక, శ్రీరాంపూర్

సింగరేణికి రుణపడి ఉంటా..



నేను బీటెక్ (ఈఈఈ) పూర్తిచేశా. డ్రోన్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నా. దేశంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో డ్రోన్ టెక్నాలజీ ద్వారా చాలా పనులు చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. తప్పకుండా ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నా. ఉచిత శిక్షణ అందిస్తున్న యాజమాన్యానికి రుణపడి ఉంటా.
– ఎంగల అఖిల్ మాధవ్, బెల్లంపల్లి

శిక్షణ బాగుంది



నేను బీఎస్సీ పూర్తిచేశా. సోలార్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ చాలా బాగుంది. భవిష్యత్‌లో విద్యుత్‌కు కావాల్సిన ముడి సరుకు బొగ్గు, నీటికొరత ఏర్పడే ప్రమాదం ఉంది. సోలార్ టెక్నాలజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా ఉద్యోగావకాశాలు లభిస్తాయనే నమ్మకం ఉంది. – అబ్దుల్ అబ్దాన్, మందమర్రి యాపల్

ఆదర్శ సేవలకు గుర్తింపు



ప్రశంసాపత్రం అందుకుంటున్న యోగేశ్వర్

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క, సారాలమ్మ జాతర సందర్భంగా పర్యావరణ, ప్రజారోగ్యకోసం మోడల్ పర్యావరణ జిల్లా పరిషత్ నిర్వహించిన ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ యోగశ్వర్‌కు తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నుంచి ప్రశంసపత్రం అందుకున్నారు. బుధవారం వరంగల్‌లో రాష్ట్రస్థాయి సైన్స్ దినోత్సవ వేడుకల్లో పర్యావరణ రక్షణలో ఆదర్శమైన సేవలకు గానూ యోగేశ్వర్‌కు రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, జిల్లా కలెక్టర్ స్మిత పట్నాయక్, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారి డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు.

నర్సింగ్ ఆఫీసర్లకు బ్యాడ్జింగ్



వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సులేమాన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి కొత్తగా నియామకమైన 254 మంది నర్సింగ్ ఆఫీసర్లకు బుధవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో బ్యాడ్జింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి బ్యాడ్జ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి సులేమాన్, అనాటమి ప్రొఫెసర్ డాక్టర్ జితేందర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు ఇన్నమ్మ, రాజమణి పాల్గొన్నారు.

పూదరి హరీశ్‌గౌడ్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్, పట్టా అందుకుంటున్న హరీశ్‌గౌడ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పూదరి హరీశ్‌గౌడ్ మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (ఎంఫీల్)లో చేసిన విశేష పరిశోధనకుగానూ బంగారు పతకం సాధించాడు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, తెలుగు యూనివర్సిటీ ఆచార్య తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ఎంఫీల్ పట్టా అందుకున్నాడు. 'కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రజా సంబంధ ప్రచార ప్రభావం–తెలంగాణ రాష్ట్ర అధ్యయనం' అనే అంశంపై 2016–17 బ్యాచ్‌కు చెందిన హరీశ్‌గౌడ్ చేసిన విస్తృత స్థాయి పరిశోధనకు బంగారు పతకాన్ని అందుకున్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎస్సార్పీ3 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి విన్నవించారు. క్యాంటిన్లో మెనూ సరిగ్గా పెట్టాలని, వాష్‌రూమ్స్ నిర్వహణ అధ్వానంగా ఉందని, భూగర్భంలో ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, ఏరియా కార్యదర్శి గోపాల్‌రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, వెంగళ కుమారస్వామి, నీలం సదయ్య, పిట్ సెక్రెటరీ పెట్టం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏజీఎంకు సన్మానం



నికోలస్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పర్యటనకు వచ్చిన సింగరేణి ఎడ్యుకేషన్ ఏజీఎం నికోలస్‌ను బుధవారం డీజీఎం(పర్సనల్) అరవిందరావు శాలువాతో సత్కరించారు. ఇంతకు ముందు ఆమె శ్రీరాంపూర్‌లో డీజీఎం (పర్సనల్)గా పనిచేసి పదోన్నతి పొంది కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ అయ్యింది. ఈ కార్యక్రమంలో పీఎం రాజేశ్వర్, డీవైపీఎంలు ఎస్.రాజేశ్వర్‌రావు, ఎం.రాజేశ్, దేవేందర్‌రెడ్డి, డీవైఎఫ్ఎం కాంతారావు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా భీమారం వాసి



కలగూర శ్రీనివాస్

భీమారం(చెన్నూర్): హైకోర్టు ఏజీపీ (సహాయ ప్రభుత్వ న్యాయవాది)గా భీమారం మండల కేంద్రానికి చెందిన కలగూర శ్రీనివాస్ నియమితులయ్యారు. హైకోర్టు ప్రకటించిన ఏజీపీల జాబితాలో శ్రీనివాస్‌కు స్థానం దక్కింది. భీమారం గ్రామానికి చెందిన కలగూర రాజ్‌కుమార్, భారతి దంపతుల రెండో కుమారుడైన శ్రీనివాస్ హైకోర్టులో న్యాయవాద వృత్తి నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం కార్మికులకు క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 26 క్వార్టర్లకు నోటిఫికేషన్ వేయగా 25 మంది సూపర్‌వైజర్లు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్‌లో 8 క్వార్టర్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కేకే గ్రూపు ఏజెంట్ రామదాసు, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయబంధు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఐదోతరగతిలో ప్రవేశం కోసం జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5న జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి రెండు బాలుర, ఒక బాలికల పాఠశాలలో ఒక్కో పాఠశాలకు 40 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మందిని (10 మంది బాలికలు, 10 మంది బాలురు) హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్ అకాడమీ క్రీడా పాఠశాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్(ఎన్‌హెచ్‌ఎం) పోస్టుల నియామకం కోసం (ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే, చైల్డ్ హెల్త్, డీపీఎంయూ, ఎన్‌టీఈపీ, టీడీటీ–హబ్) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ mancherial.telangana.gov.in ను సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తుకు అవసరమైన అన్ని సర్టిఫికెట్ల నకలు కాపీలను జతపరుస్తూ ఈనెల 29న ఉదయం 10:30 నుంచి మార్చి 2 సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఖాళీలు ఇవే...

ఎన్‌సీడీలో 9 మంది స్టాఫ్‌నర్సులు, ఆర్‌బీఎస్‌కేలో ఫార్మాసిస్టు గ్రేడ్ 2లు 5, చైల్డ్ హెల్త్‌లో రిఫ్రిజిరేటర్ మెకానిక్ ఒక్కరిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోనున్నారు. ఔట్‌సోర్సింగ్ విభాగంలో డీఎంపీయూలో డిస్ట్రిక్ట్ అకౌంట్స్ ఆఫీసర్ 1, డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్ 1 ఉండగా, కాంట్రాక్టు పద్ధతిలో ఎన్‌టీఈపీలో ఎస్‌టీఎల్‌ఎస్ 1, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ 1, ఎన్‌యూహెచ్‌ఎంలో సీనియర్ డాట్స్ ప్లస్ టీబీ హెచ్ఐవీ 1, మెడికల్ ఆఫీసర్ 2 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ విభాగంలో ఎన్‌యూహెచ్‌ఎంలో డీఈవో కమ్ అకౌంటెంట్, టీహబ్‌లో డీఈవో 1, సపోర్ట్ స్టాఫ్ 2 మొత్తం 26 పోస్టులు ఉన్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శాస్త్రినగర్‌కు చెందిన రుక్మాబాయి భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై వైన్స్ వద్ద రోడ్డు దాటే క్రమంలో నిర్మల్ వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని బైక్ ఢీకొంది. స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

తుపాకుల మోత..!

- నరేందర్‌కు తుపాకి ఎక్కడిది..?
- జిల్లాలో యథేచ్ఛగా వినియోగం
- పోలీస్ నిఘా వర్గాల వైఫల్యమే కారణమా..!



మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లాలో మరోసారి తుపాకుల మోత వినిపించింది. జిల్లాలో మావోయిస్టుల పేరిట ఎయిర్‌గన్‌తో బెదిరించిన ఘటన మరిచిపోకముందే, జిల్లా కేంద్రంలో ఓ ప్రజాసంఘాల నాయకుని వద్ద ఓ బొమ్మ తుపాకి లభించిన ఘటన కలకలం రేపింది. తాజాగా కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామంలో కాల్పులు జరిగాయి. బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామానికి చెందిన గోమాస నరేందర్‌కు, కన్నెపెల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన బేబితో వివాహమైంది. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. నరేందర్ కరీంనగర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, బేబి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. నరేందర్ అదనపు కట్నం కోసం భార్య, అత్తమామలు గోలేటి శంకర్, లక్ష్మిలను వేధిస్తున్నాడు. ఏడాది క్రితం గొడ్డలితో అత్తమామలపై దాడికి పాల్పడ్డాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాళ్లగురిజాల పోలీసుస్టేషన్ పరిధిలోని రంగపేటకు చెందిన మహేష్‌తో కలిసి మంగళవారం అర్ధరాత్రి సాలిగాం గ్రామానికి పథకం ప్రకారమే వచ్చి మద్యం సేవించాడు. మామ గోలేటి శంకర్‌ను బయటకు రమ్మని పిలవడంతో భయపడిన అతడు ఇంటి వెనుకాల నుంచి వెళ్లిపోయాడు. నరేందర్ తుపాకితో రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇంతకు ఆ తుపాకి ఎక్కడిదనేది పోలీసులకు సవాల్‌గా మారింది. జిల్లాలో తుపాకుల కలకలం ఒకటి మరిచిపోయే లోపే మరొకటి తెరపైకి రావడం పోలీస్ వర్గాలకు పెను సవాల్‌గా మారింది. నరేందర్ వెంట వచ్చిన మహేష్ తుపాకి సమకూర్చాడా, లేదా నరేందర్ కొనుగోలు చేశాడా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొనుగోలు చేస్తే ఎక్కడ అనేది తేలాల్సి ఉంది.

యథేచ్ఛగా వినియోగం

జిల్లాలో కొందరు యథేచ్ఛగా తుపాకులు వినియోగిస్తున్నారని సమాచారం. జిల్లాలో 38మంది గన్ లైసెన్స్ కలిగిన వారు ఉన్నారు. గతంలో కొందరు రియల్టర్లు అక్రమంగా తుపాకులు కలిగి భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేసిన దాఖలాలు ఉన్నాయి. కొందరు సులువుగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో బిహార్, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి తుపాకులు కొనుగోలు చేసి ఇతరులను బెదిరింపులకు పాల్పడిన సందర్భాలు వెలుగు చూడడం గమనార్హం. జిల్లాలో విచ్చలవిడిగా తుపాకులు, మరణాయుధాలతో సంచరిస్తుండడం పోలీస్ నిఘా వర్గాల వైఫల్యమేననే ఆరోపణలు ఉన్నాయి. సాలిగామ గ్రామంలో కాల్పుల కలకలంపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌ను సంప్రదించగా.. కేసు విచారణ చేస్తున్నమని, త్వరలోనే ఆ తుపాకి ఎక్కడిదనేది వెల్లడిస్తామని తెలిపారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు



ట్రాక్టర్ తనిఖీ చేస్తున్న ఏఎస్సై

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మండలం అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకు వద్ద మట్టి తరలించే ట్రాక్టర్‌ను బుధవారం ఇరిగేషన్ ఏఈ రమ్య పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. అదనపు ఎస్సై మల్లేశం ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. బంకు యజమాని ఇక్కడ కింద ఉన్న మట్టినే ట్రాక్టర్‌లో పోస్తున్నామని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం ఊర చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలో చెరువువద్దకు వెళ్లి చూడగా మట్టి తరలించిన ఆనవాళ్లు కనిపించాయన్నారు. బంకు వద్ద పోసిన మట్టి అందుగులపేట ఊరచెరువు వద్ద నుంచి తరలించినట్లు అనుమానం ఉందన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో నీటమునిగి ఒకరు మృతి, మరొకరు గల్లంతు



సాయి (ఫైల్)



శ్రీహరి (ఫైల్)

తలమడుగు(బోథ్): సరదాగా ఈత కోసం వెళ్లి ఒకరు మృతి చెందగా మరొకరు గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన దారట్ల సాయి అలియాస్ వినోద్ (18), మర్రిపల్లి గ్రామానికి చెందిన సోయం శ్రీహరి (16) బుధవారం గ్రామంలో వ్యవసాయ కూలీపనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు జక్కుల ఓం ప్రకాష్ పొలంలోని బావి వద్దకు వెళ్లి తాడు సాయంతో లోనికి దిగారు. ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయారు. ఎంతకూ రాకపోవడంతో సమీపంలో పనిచేస్తున్న రైతులు బావి వద్దకు వెళ్లి చూడగా బట్టలు, చెప్పులు, సెల్‌ఫోన్ గమనించారు. చుట్టుపక్కల కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై సురేందర్ ఈతగాళ్ల సాయంతో బావిలో గాలించగా సాయి మృతదేహం లభ్యమైంది. శ్రీకాంత్ శవం దొరకక పోవడంతో పాటు చీకటి పడడంతో తిరిగి వెళ్లిపోయారు. కాగా దారట్ల శంకర్, నంద దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సాయి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.